ప్రాప్తం

--నిడదవోలు మాలతి

నూకాలికి ఉత్తరం వచ్చింది. అదెక్కడినించి వచ్చిందో దానికి తెలుసు. కానీ అందులో ఏముందో తెలుసుకోవాలి. మేడమీద అమ్మాయి ఒక్కతే ఉండే సమయం చూసుకుని నూకాలు చీపురు తీసుకుని అక్కడికి వెళ్లింది.

"నీకో వందమార్లు చెప్పేను అలా చీపురు పట్టుకుని నామీదకి దండెత్తొద్దని. నేను లేనప్పుడొచ్చి తుడిచి వెళ్లిపోలేవూ?" కసురుకుంది అమ్మాయి.

నూకాలికి అమ్మాయిగారి కసుర్లూ విసుర్లూ అలవాటే. అందుకే "పోన్లెండమ్మా! రేపనుంచి అనాగే మీర్లేనప్పుడే వొచ్చి తుడిసెల్తాను" అంది నూకాలు, కుర్చీ, బెంచీ, మంచం అటూ ఇటూ పనిమంతురాలయిన ఇల్లాలి ఒడుపుతో లాగేస్తూ.

"నీమొహం కాదూ. రోజూ ఇలాగే అంటావు," అంది అమ్మాయి కోపంగా. "ఆకుర్చీ ఇటెయ్యి. ఎక్కడివక్కడ ఉంచవు కదా."

అమ్మాయికి అందుకే కోపం. నూకాలు గది తుడవడానికొచ్చిందంటే, వెళ్లేవేళకి గది దక్షయజ్ఞవాటికలా చేసి పెడుతుంది.

"అమ్మాయిగోరూ," నూకాలు మొహం నిండుగా నవ్వుతూ, "ఇది కూసింత సదివి సెప్పరూ?" అంది కొంగుముడి విప్పుతూ.

"ఏమిటది?"

ఉసిరికాయంత కొంగుముడి జాగ్రత్తగా విప్పి, ఉండ చుట్టుకుపోయిన ఓ కార్డుముక్క అమ్మాయిచేతిలో పెట్టింది.

"అఘోరించినట్టే ఉంది. దీనికేపైనా అర్థంవూ ఆకారంవూ ఉంచేవా?" అందా అమ్మాయి ఆ ఉండ విప్పి సాపు చెయ్యడానికి ప్రయత్నిస్తూ.

నూకాలు నాలుక్కరుచుకుంది.

"తొమ్మిదోతారీకున సింహాద్రి వకొస్తున్నాడుట. రెండు రోజులుంటాడుట."

"తొమ్మిదా?" అంది నూకాలు ఆలోచిస్తూ.

"ఊఁ."

"ఏవోరవయిందండీ?"

"సోంవారం."

"సోంవోరఁవా?. ఇయాల సుక్కురోరం గందండీ. సుక్కురోరం, సనోరం, ఆదోరం, మూన్నాల్లున్నయ్యన్నమాట" అంది నూకాలు బుగ్గన వేలుంచి లెక్కలేసుకుంటూ.

చెక్కిన రాతిబొమ్మలా ఉంటుంది అనుకుంది అమ్మాయి మనసులోనే దానివేపు చూస్తూ.

"రెండేళ్లయింది వాడు మిలిటరీలో చేరి. రెండేళ్లున్నదానివి మూడ్రోజులుండలేవుటే," అంది నవ్వుతూ.

అమ్మాయిగోరు నవ్వితే బావుంటది, రాణీగారినాగుంటది, అనుకుంది నూకాలు మనసులోనే.

"ఎన్నగంట్లకొస్తడంటండీ?" అంది మాట మారుస్తూ.

"సాయంత్రం మెయిల్లో వస్తాట్ట. స్టేషనుకెళ్తావా?"

"ఎఁదుకండీ? ఆడికేటి ఇల్లు తెల్దనా? నానెల్లకపోతే టేసినుదనక వొచ్చినోడు ఇంటికి రాడనా?" అంది నూకాలు మొహం పక్కకి తిప్పుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ. అబ్బాయిగారు అదెక్కడ్నుంచో విమానంమీద వచ్చినప్పుడు అమ్మాయిగోరు స్నేయితురాల్లకి కాఫీలిప్పించటం, బొంబాయికెల్డం దానికెరికే.

అమ్మాయిక్కోపం వచ్చింది. "కబుర్లు కట్టిపెట్టి పని చేస్కో, ఫో," అంటూ కసురుకుంది.

000

నూకాలు నిప్పులమీద నడుస్తున్నట్టు ఉరుకులు పరుగులతో ఇల్లు చేరింది. వీధికొసనించే అత్తా, అత్తా అంటూ కేకలేస్తూ.

ఎల్లమ్మ నులకమంచంమీద పడుకుని కునుకుతోంది. ఎల్లమ్మ పనికెళ్లదు. అది పెద్ద మేస్త్రీపెళ్లాం. మిలిట్రీలో ఉజ్జోగం కొడుక్కి. "నానెందుకు పనికెల్లాలా?" అంటుంది దర్జాలొలకబోస్తూ.

"అత్తా, నీకొడుకొస్తన్నడంట," అంది నూకాలు పొంగిపోతూ.

"నిజఁవే? ఒప్పుడె? ఒప్పుడొస్తన్నడు?" ముసిల్దాని ఆనందానికి హద్దుల్లేవు.

"సోంవోరం. సోంవోరంవంట. ఇంక మూడ్రోజులుంది."

ఎల్లమ్మ గబగబా లేచి అవతలికెళ్లింది ఎమర్జెన్సీ బులెటిన్‌లో ఈవార్త ప్రసారం చెయ్యడానికి.

నూకాలొక్కత్తీ మిగిలిపోయింది ఆ చుట్టుగుడిసెలో.

"రెండేల్లమట్టీ నానొక్కదాన్నేగంద." అనుకుంది సాలోచనగా. సోంవోరం ఒస్తన్నడంట. అమ్మగారు పండుక్కిచ్చిన చిలకాకుపచ్చ కోకున్నాది. అమ్మాయిగోరు కుట్టు సరిగ లేదని యిచ్చేసిన ఎర్ర జాకట్టున్నాది. పచ్చకోక కట్టుకుని ఎర్రజాకట్టేసుకుంటే, "సిలకనాగున్నవే" అన్నాడోపాలి. ఆడి మనసుకి నచ్చినట్టు సెయ్యాల. రొండ్రోజులే ఉంటాడంట. ఆ రెన్నాల్లూ సేసినయి మల్లీ సెలవులొచ్చేవరకు యాదకుండాల. అమ్మగార్ని జీతంలో యిరగ్గోసుకొమ్మని బతింవలాడితే ఓ రూపాయిత్తారు. సెజ్జ బూరెలొండుత. సెజ్జబూర్లంటే పడి సత్తాడు.

రావుడిగోరి అప్పమ్మనడిగితే ఓ పోటేసి ఎడతది. రొండు రోకల్లాడితే గానీ నలిగసావప్ ...

"అట్టా సూత్తా కూకుడుండిపోనావేటి? ఎల్లెల్లు. నీలొట్రా" ఎల్లమ్మ అరిచేవరకూ నూకాలు ఈలోకంలో పడలేదు మళ్ళీ.

ఉలిక్కిపడి, బిందె తీసుకుని వీధికొళాయివేపు సాగింది. ఎల్లమ్మద్వారా వార్త అందరికీ అందిందేమో దారిపొడుగునా అందరూ అడుగుతూనే ఉన్నారు, "సింవాద్రి ఒస్తన్నాడంట గదే" అంటూ. నూకాలు గంగడోలులా తలూపుతూనే ఉంది. దానికి నోట మాట రావడంలేదు!

వస్తుందోస్తుందనుకున్న సోమవారం రానే వచ్చింది. నూకాలూ, ఎల్లమ్మా నూర్పిళ్లప్పుడు చేసినంత హడావుడి చేస్తున్నారు. ఆదివారం సంతలో సజ్జలూ, బెల్లం కొనుక్కొచ్చింది నూకాలు అమ్మగారి దగ్గర అప్పు పుచ్చుకుని.

"ముంతలో మూడ్రూపాయిలు దాసినాను. సన్నబియ్యం ఒట్రా. నాకొడుకు ఆ దబ్బనాల్లాటి బియ్యం తిన్నేడు," అంది ఎల్లమ్మ.

"మరే. మిలిట్రీలో ఆడికి సన్నబియ్యం కూడా, ఆవుపాలూ ఎడతారు," అంది నూకాలు ఎత్తిపొడుస్తూ.

"నీ పెడసరబ్బుద్ధి ఆడొచ్చే అణసాల," అంది ఎల్లమ్మ కసిగా.

"రానీ" అంది నూకాలు.

000

ఎదలో ముల్లయి తగిలింది ఏదో. "రానీ ... రానీ ..." అనుకుంది తనలో తనే గొణుక్కుంటూ.

"సుప్వీ, సుప్వీ పోటేత్తే ఏనాటికి నలిగేను. యెయ్ దబదబ నాలుగు పోట్లు" కసురుకుంది అప్పమ్మ వీధిలోకి కళ్లెట్టి రోకలాడిస్తున్న నూకాల్ని.

"అది గాదే. ఆడొచ్చినట్టుంటేనూ .." అంది నూకాలు క్షమాపణలు చెప్పుకుంటూ.

"తోటకూర గాదూ. సాయంతరవేల బండి మజ్జాన్నంవే వచ్చీసినట్టుందా నీకు?" అరిచింది అప్పమ్మ.

నూకాలు ఊపిరి తీసుకుని, ఉస్, ఉస్మంటూ పోటెయ్యసాగింది, ఒక్కోపోటూ సోల్జర్ బూటులా వినిపిస్తుంటే.

గుడిసెలో ఎల్లమ్మ పొయ్యి రాజేసి మూకుడు పొయ్యిమీద పెట్టింది. నూకాలికి జ్ఞానం తెలిసేక, అత్తని పొయ్యిదగ్గర చూడ్డం ఇదే. "మరి, కొడుకు" అనుకుంది. ఈపాటి అదురుష్టానికి మాంవెప్పుడూ నోసుకోనేదు. దానికి సన్నగా నవ్వొచ్చింది.

"నువ్వలా ముసిముసినవులు నవ్కొంటా కూసో. నేంపోతా," అంది అప్పమ్మ అస్త్రసన్యాసం చేస్తూ.

"నేదునే. రా, రా, రొండు పోట్లేత్తే అయ్‌పోతాది" అంది నూకాలు వెనక్కుంచిన బొల్లప్పుక్క రోట్లో పడేస్తూ.

బూరెలపిండి అత్తకిచ్చేసి, అమ్మగారింటికి పరిగెట్టింది.

అమ్మగారు చిటపట్లాడేరు, "ఇంకా ఒంటిగంటేనా కాలేదు. అంట్లు తోమేసి పోతే, మళ్లీ కాఫీగిన్నెలు ఉడిపోవూ? అవి నేను కడుక్కోనా?" అంటూ.

నూకాలు పరిదీనవదనయై నిలుచుండిపోయింది. "గాదమ్మగోరూ, ఇంటికాడ సిన్నపనుందియేల," అంది.

"ఇవాళ సింహాద్రి వస్తున్నాడమ్మా" అంది అమ్మాయి, ఆ ఒక్కముక్కలోనూ పూర్వాపరాలు విశదం చేస్తూ.

"సరేలే, ఏదో ఓ వేళప్పుడొచ్చి ఆ కాఫీగిన్నెలు కడిగేసి పో," అందావిడ దయ తలచి.

నూకాలు సంతోషపడిపోతూ "అట్టాగేనండి" అని పావుగంటలో మళ్లీ ఇంటిదారి పట్టింది. సగందూరం వెళ్లేసరికి దానికి జ్ఞాపకం వచ్చిందేమో మళ్లీ వెనక్కొచ్చింది.

"అమ్మాయిగోరూ," అంది తలుపుచాటున నిలబడి.

చదువుకుంటున్న అమ్మాయి తలెత్తి చూసింది ఏవిటంటూ.

"రొండు సంపెంగపూలు కొస్కుంట్నండి," అంది ఆశగా.

అమ్మాయి చిరాకు ప్రదర్శించింది. "నీకెప్పుడూ ఆ సంపెంగచెట్టుమీద కళ్లు. కావలిస్తే బజారులో లేవూ?"

"ఈఒక్కపాలేనండీ. బజార్ల వోడిపోయుంటాయండి" అంది నూకాలు దీనంగా.

"సరేలే" అంటూ సాయంత్రం జడలో పెట్టుకోడానికి పొద్దున్నే కోసుకుని దాచుకున్న దండ దానిమీదకి విసిరింది అమ్మాయి.

నూకాలు మురిసిపోతూ దండ అందుకుని ఇంటివేపు పరుగులీసింది. దానిమనసు ఇవాళ దాట్లగుర్రంలా ఉరకలేస్తూంది.

ఇంటిదగ్గర ఎల్లమ్మ చాలామటుకు వంట పూర్తి చేసింది. కానీ నూకాలికి సంతృప్తి కలగలేదు. మళ్లీ మళ్లీ చూడసాగింది ఒక్కొక్క గిన్నే తీసి. అరకోడి కూర చేసింది. చేపలపులుసు చేసింది. అమ్మగారు రెండురోజులక్రితం ఇచ్చిన ఊరగాయముక్క జాగర్తగా దాచిపెట్టింది. సన్నబియ్యం మల్లెపువ్వులా వార్చిపెట్టింది.

"మూడ్రోజులు రెయిల్లోనే అవుతాదంట. ఒప్పుడు తిన్నడో? పాడు రెయిల్లో ఏటి దొరుకుతాది. సాంబారొణ్ణం ఆల్లే కలిపి పొట్లాలు కట్టి ఎడతారంట. శ. అదేటి బావుంటది. నేపోతే కారీజీ ఉచ్చుకుంటె రూపాయ ముప్పయేడు పైసలు తీస్కొని రొండు మెతుకులెడ్తరంట" అని బాధ పడింది. "పోనీ, ఇంకేదయిన చేదునా"అని మనసు పీకింది. దండుబజారులో ఓ బేడ బంగాళదుంపలు తెచ్చి వేపుడు చేస్తేనో అని మనసు ఉవ్విళ్లూరింది. చూరులో పెట్టిన డబ్బీలోంచి ఓ బేడ తీసుకుని, "నానిప్పుడే ఒస్త, పొయ్‌మీద కూర సూడు," అని అత్తకి పురమాయించి, దండుబజారువేపు దౌడు తీసింది. "ఉప్పుడెక్కడికే?" అంటున్న అత్తమ్మ మాటకి జవాబు చెప్పనేలేదు.

పదినిముషాల్లో నూకాలు బంగాళదుంపలు తెచ్చి కూర చేసేసింది. పెద్దాసుపత్రి గంటస్తంభంలో మూడు చూపేవేళకి అది కనీసం ఆరుమార్లయినా వీధిచివరిదాకా వెళ్లి వచ్చి వుంటుంది. రైళ్లు రోజూ ఆలస్యంగా వస్తాయి కదా ఈ ఒక్కరోజూ ఓ గంట ముందు రాకూడదూ అనిపించింది. కాలు కాలినపిల్లిలా నూకాలు తిరుగుతూంటే ఎల్లమ్మ నవ్వుకుంది. "ఈదిచివరిదాకా ఒచ్చినోడు ఇంటికి రాడేటే? రంగులరాట్నంలా తిరుగుతున్నవు" అంది.

నూకాలుకి కోపోద్ధృతంచేత మాట నోట రాలేదు. మళ్లీ వీధి చివరిదాకా వెళ్లి అక్కడున్న రిక్షావాణ్ణి అడిగింది, "అన్నా, మేలుబండీ ఇంకా రానేదా?" అని.

"నేదప్పా, గంటన్నర నేటంట," అన్నాడు రిక్షావాడు దిక్కులు చూస్తూ.

"ఛ, ఎదవబల్లు" అని కసిగా తిట్టుకుంది. మరో గంటన్నరతరవాత అదే చోట మరో రిక్షావాడు మేలుబండి వచ్చి వెళ్లిపోయిందని చెప్పేడు. సింవాద్రి జాడ లేదు.

కోడల్ని వేళాకోళం చేసిన ఎల్లమ్మ కూడా కొడుక్కోసం వీధి చివరిదాక వెళ్లి చూసి రాకుండా ఉండలేకపోయింది.

ఉస్సురనుకుంటూ ఎందుకు వాడు రాలేదో ఊహించుకుంటూ గుడిసెలో అడుగెట్టిన ఇద్దరికీ ఓరబంపుగా ఉన్న తడికె తోసుకుని లోపలికి ప్రవేశించి సుష్టుగా విందారగించి వస్తున్న గ్రామసింహం ఎదురైంది. నూకాలికి కానీ ఎల్లమ్మకి గానీ ఆ ఊరకుక్కని కొట్టాలనిపించలేదు.

తడిగుడ్డలో చుట్టి పెట్టిన సంపెంగపూలు వాడి మొహం వేలాడేసేయి.

నూకాలు కట్టుకున్న కొత్తకోక నలిగిపోయింది.

మర్నాడు దానిమొహం చూసి "రాలేదేమిటే?" అనడిగింది అమ్మాయిగారు.

"నేదండీ," అంది నూకాలు నిరామయంగా.

ఆరోజు మధ్యాన్నం కూడా ఊరకుక్క విందుకొచ్చింది. తనకోసం కాచుకున్న గంజి దానికి పోసి చూస్తూ కూచుండిపోయింది నూకాలు.

ఆరాత్రి ఎవరో పిలిచినట్టయి ఉలిక్కిపడి లేచింది. "ఎవురే?" అంది ఆపిలుపుకే మేల్కొన్న ఎల్లమ్మ.

"ఎవురది?" అంది నూకాలు అత్తమాటలు యాంత్రికంగా ప్రతిధ్వనిస్తూ. "నేనేలేయే" అన్నాడు సింవాద్రి లోపలికొస్తూ. "ఉప్పుడేణ్ణించి? ఇంతరేతిరేటి?" అంది నూకాలు పూర్తిగా మేలుకొని. అప్పుడు రాత్రి రెండున్నరయింది.

సింవాద్రి మంచందండెమీద కూర్చుని బూట్లిప్పుతూ, "పాసింజరులో ఒచ్చినా. నేటయింది. ఎదవబండి. నాటుబండి నయం దానికన్నా," అన్నాడు. "అప్తే నన్నెందుకొచ్చినావు కావు?" అనడిగింది నూకాలు, అంతవరకూ ఆనందాతిరేకంచేత మూగవోయిన బుద్ధి తేరుకున్నాక. "నిన్ననే వొచ్చినా. అనకాపిల్లికాడ మావోడే ఓడు దిగినాడు. ఆడితో నన్నూ దింపేసినాడు. ఒద్దురా, తరువాతొస్తాలే అంటే ఇంటేనా?"అన్నాడు సింవాద్రి తనకి అంతటి ఉదాత్తుడయిన స్నేహితుడు ఉన్నందుకు కించిత్ గర్వం వెలిబుచ్చుతూ.

మర్నాడు పొద్దున్నే లేచి, పనిలోకి వెళ్లబోతున్న నూకాల్ని ఆపి, "మాసెడ్డ ఆకలేస్తంది. తింటానికేపైనా పెట్టెల్లు. మళ్లీ ఏమజ్జానానికొస్తవో," అన్నాడు సింవాద్రి.

నూకాలు నిస్సహాయంగా చూసి పొయ్యి రాజేసింది. గంజి కాచి, ఓ ఉప్పురాయేసి వాడికి అందిస్తుంటే దానికళ్ల నీళ్లు తిరిగేయి. "నిన్న నివ్వొస్తవని ఏటేటో సేసిందది. నువ్ రానేలేదు," అంది ఎల్లమ్మ.

"ఏటిస్తే ఏటుందే. అంతా నీసేతిలోనుంది గానీ," అన్నాడు సింవాద్రి నూకాలుమొహంలోకి చూస్తూ. "నీముకంలే" అంది నూకాలు మూతి ముడుచుకుని.

ఆమాటలో తీవ్రతకి తుళ్లి పడ్డాడు సింవాద్రి. వాడిది మిలిటరీ డిసప్లిన్. "కమనీయ భూమిభాగములు లేవె పడియుండుటకు, దూదిపరుపులేల" అని పోతనగారు చెప్పేరని వాడికి తెలీదు కానీ వాడి అభిప్రాయం అదే. (ఆంధ్రప్రభ, సెప్టెంబరు 2, 1964 లో ప్రచురితం.)

గ్రహ బలాబలాలు

సూర్యమాన గ్రహచారంలో
దలైలామా, అమెరికాఅధ్యక్షుడూ కేన్సీరియన్లు
ఉభయులకూ కేంద్రం ఆత్మ.
ఒకరికి ఆదర్శం ఆత్మావలోకనం
రెండోవారు చేస్తున్నారు ఆత్మప్రదక్షిణం
ఒకరికి ఆలంబన విశ్వమానవసౌభ్రాతృత్వం
రెండోవారికి విశ్వం సర్వస్వామ్యసంకలితం.
ధృవాంతరసీమలకు విస్తరిల్లిన
వారి తేజోపుంజాలు
మిరుమిట్లు గొల్పుతున్నాయి
కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.
అలివికాని అంధకారంలో
మురికివాడలో
ఇరుకుగదిలో
వెతుక్కుంటున్నాను
అల్పిష్పంత జాగాకోసం.
మూడోపాదం మోపనున్న వామనుడిలా.
నేను మూడో కేన్సీరియనుని.

\- నిడదవోలు మాలతి